రచన - జూన్, 1994

"చాలా ఎక్కువమంది అపరిపక్వ దశలోని తమ రచనలను
రాచకొండవారి స్థాయిలో ఉన్నట్లు భావిస్తున్నారు-"

# హామీపత్రం

అనుకోకుండా పని తగిలింది. ఆ ఊరెళ్ళాను.

ఆ ఊళ్ళో నాకు స్నేహితుడు, దూరపు బంధువు అయిన నరసింహం ఉన్నాడు. ఆ ఊరొచ్చి వాళ్ళింటికి వెళ్ళకపోతే నన్ను తినేస్తాడు. అందులోనూ నాకంటే రెండేళ్ళు పెద్దేమో, 'పెద్దాళ్ళపట్ల నీకు బొత్తిగా గౌరవం లేదు" అని వ్యాఖ్యానిస్తాడు. కాబట్టి అనుకునే వాడింటికి వెళ్ళాను.

మేము కలుసుకుని పదిహేనేళ్ళయింది. ఈ పదిహేనేళ్ళలోనూ రచయితగా నేను బాగా ఎదిగాను. అది వాడింటికి వెళ్ళాకే తెలిసింది.

వాళ్ళింట్లో వాడి తల్లి, భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉంటున్నారు. పెద్ద కొడుకు ఎమ్మే - ఆ ఊళ్ళోనే చదువుతున్నాడు. రెండోవాడు ఇంజనీరింగు - కర్ణాటకలో చదువుతూ - సెలవులకు వచ్చాడు. ఆఖరిది - ఆడపిల్ల - కంప్యూటర్ బియస్సీ సెకండియర్‌కు వచ్చింది.

అంతా కూడా రచయితగా నాకో ప్రత్యేక గౌరవాన్నిచ్చారు. నా రచనలు బాగుంటాయన్నారు. వాళ్ళ మాటల్లో, ప్రశ్నల్లో నాపట్ల భయం, గౌరవం, సంకోచం, కుతూహలం కలగలుపుగా తొంగిచూశాయి. వాళ్ళు నన్నలా గుర్తించడం నాక్కాస్త యిబ్బందిగా తోచింది. వాతావరణంలోని ప్రత్యేకతను తొలగించడంకోసం, "కథలు రాసే శక్తి అందరికీ ఉంటుంది. ప్రయత్నించిన వాళ్ళు రచయితలు. లేని వాళ్ళు పాఠకులు" అన్నాను.

నా అభిప్రాయంతో నరసింహం భార్య సుతారామూ అంగీకరించలేదు. మిగతా వాళ్ళంతా సందిగ్ధంలో పడ్డారు కానీ - వాడి తల్లి మాత్రం వెంటనే, "బాగా చెప్పావు బాబూ! ఈ మాటే నేనూ నా మనవడికి చెప్పాను. నమ్మడే!" అంది.

ఎమ్మే చదువుతున్న ఆ మనవడి పేరు బామ్మగారి నోట రామంగా

ఉచ్చరించబడింది. ఆ రామం కథలు రాస్తాడు. ఇంతవరకూ కాలేజీ మాగజైన్లో రెండు కథలు వచ్చాయి. మిగతావన్నీ పత్రికల్నించి తిరిగొచ్చాయి.

నేను కాస్త ప్రోత్సహించేక అందరిలోంచీ ఒక కొత్త అభిప్రాయం బయటపడింది.

కథ అల్లడం కష్టం కాదు. వ్రాయడం కష్టం కాదు. కానీ ప్రచురణకు అదృష్టముండాలి. అదృష్టమున్నవాడికి పేరు వస్తుంది. అలా పేరు వచ్చిన వాళ్ళ కొందరి రచనలే అస్తమానూ అన్నిచోట్లా ప్రచురితమవుతూంటాయి.

నేను కథలు వ్రాయడమే కాక కొన్ని పత్రికలకి కథలు కూడా ఎన్నిక చేస్తూంటాను. ఆ కథలకు జత పరచిన ఉత్తరాలను బట్టి నాకు అర్థమయిందేమిటంటే - చాలా ఎక్కువమంది అపరిపక్వ దశలోని తమ రచనలను రాచకొండవారి స్థాయిలో ఉన్నట్లు భావిస్తున్నారు. వారికి రచయిత కాగల యోగ్యత లేదు. తమ రచనల లోపాల్ని తాము వ్రాసింది చదివి ఆకళింపు చేసుకోగలవారు కొందరుంటారు. వారిలో కొందర్నించి రచయితలు పుట్టుకొచ్చే అవకాశముంది.

కానీ నేనిది వీళ్ళకు చెప్పేదెలా?

ఈలోగా రామం బామ్మగారు, "మా రామం కథలు చాలా బాగా వ్రాస్తాడు. అన్ని రకాలూ వ్రాస్తాడు. కానీ వాడి కథలు కనీసం పిల్లల పత్రికల వాళ్ళు కూడా వేసుకోవడం లేదు. ఇది న్యాయమేనంటావా బాబూ!" అంది.

నా మనసు చివుక్కుమంది. తట్టుకోలేక, "పిల్లల కథలను కనీసం అనకూడదు. పెద్దల కథలకంటే అవి వ్రాయడమే కష్టం. అన్ని భాషల్లోనూ శతాబ్దాల తరబడి లక్షలాది కథలు వచ్చాయి. అందువల్ల ఒరిజినల్ కథలు వ్రాయడానికి కల్పనాశక్తి, మేధాశక్తి చాలా అవసరం" అని ఇంకా ఏదో అనబోయి అప్పటికే నన్ను నేను పొగుడుకునే దుస్థితికి వచ్చానని గ్రహించి ఆగిపోయాను.

"మచ్చుకు మా వాడి కథ ఒక్కటి చూడు బాబూ - అన్నీ నీకే తెలుస్తాయి" అంది రామం బామ్మగారు.

చూడాలని నేనూ కుతూహలపడ్డాను. ఎందుకంటే ఒక ప్రముఖ బాలల మాసపత్రికకు వచ్చే కథలన్నీ నేనే పరిశీలించి ఎన్నికచేసి తిరగ వ్రాస్తున్నాను. వచ్చే కథల్లో తొంభైశాతం మక్కికి మక్కీ కాపీ కథలు. మిగతా పదిశాతంలో రచనా చమత్కృతి ఉండడం అరుదు. అలా ఉన్నవాటిలో కల్పనాశక్తి లోపిస్తుంది. ఎన్నికచేసిన కథల్లో తొంభైతొమ్మిది శాతానికి నా కల్పనా శక్తిని జోడించి తిరగవ్రాస్తే తప్ప అవి కథలు కావు. పిల్లల కథల విషయంలో రచయిత మనుష్యులే తప్ప మాన్య రచయితలు మనకు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. ఈ రామంలో మాన్య రచయిత ఉంటే ఉపయోగించుకోవచ్చునన్న ఆశ కూడా నాలో పుట్టింది.

రామం తన కథను తెచ్చి నాకిచ్చి, "నచ్చితే మీరిది ప్రచురణకు తీసుకోవచ్చు. నాకు అభ్యంతరం లేదు" అన్నాడు.

కథ పేరు 'రాజు కొడుకులు -ఏడు చేపలు.' తమాషాగా ఉందే అనుకుని

పొరబడ్డాను. కానీ ఆ కథ అదే! అనగనగా ఒక రాజు. ఆ రోజుకు ఏడుగురు కొడుకులు. వాళ్ళు వేటకు వెళ్ళి ఏడు చేపలు తెచ్చారు.... నా బంగారు కన్నంలో వేలు పెడితే కుట్టనా అంది చీమ....

"ఎంత బాగా రాశాడో... కానీ మూడు పత్రికలవాళ్ళది తిప్పి పంపారు. ఇలాంటి కథలకు ప్రోత్సాహం రాకపోతే దేశంలో నుంచి రచయితలెలా పుట్టుకొస్తారు?" అంది బామ్మగారు తెలుగు సాహిత్యపు భవిష్యత్తు గురించి వ్యధ చెందుతూ.

ఏమనాలో తెలియక, "ఇలాంటి కథలు పత్రికా సంపాదకులు వేరే శీర్షిక కింద తమకు తామే వ్రాసుకుంటారు. బయటి రచయితల నుంచి స్వంత కథలను మాత్రమే ఆశిస్తారు" అంటూ రామానికి ఆ కథను తిరిగిచ్చాను.

అప్పుడు రామం వెంటనే ఒక తెల్ల కాగితం మీద, "ఈ రచన పూర్తిగా నా స్వంతం. ఏ భాషలోని ఏ రచనకూ అనువాదం, అనుసరణ కాదు" అని వ్రాసి నాకిచ్చి - "ఇదిగో - హామీపత్రం! ఇది లేదనేగా మీరిది నా స్వంత కథ కాదనుకున్నారు?" అన్నాడు.

✦

(రచయితలు ప్రస్తుతం హామీ పత్రానికిస్తున్న విలువపై స్వానుభవాలు పురస్కరించుకుని ఈ కథ వ్రాయడం జరిగింది. రామం పేరు కల్పితం. కానీ ఎమ్మే చదువు కల్పితం కాదంటే పాఠకులు ఆశ్చర్యపోగలరేమో. - రచయిత)

✦ ✦ ✦